ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శనివారం 10 ఫిబ్రవరి 2024

సమ్మక్క, సారలమ్మ జాతరకు ముమ్మర ఏర్పాట్లు 8లో..
హత్య కేసులో నిందితుడి అరెస్ట్ 7లో..

'ఉపాధి' లక్ష్యం ఖరారు



- జిల్లాలో 2024-25లో 38.98 లక్షల పని దినాలు
- ప్రణాళిక సిద్ధం చేసిన గ్రామీణాభివృద్ధి శాఖ
- అభివృద్ధి పనులకే మొగ్గు
- జిల్లాలో 1,55,850 జాబ్ కార్డులు...

జగిత్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నివారించి.. ఉపాధి కల్పించడంలో భాగంగా రానున్న సంవత్సరానికి ఉపాధి పని దినాల లక్ష్యాన్ని ప్రభుత్వం ఖరారు చేసింది. ఇందుకు అనుగుణంగా 2024-25 ఈజీఎస్ లక్ష్య ప్రణాళికను సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా 2024-25లో 38,98, 590 పని దినాలు పూర్తి చేయడమే లక్ష్యంగా ఈజీఎస్ అధికారులు సిద్ధమవుతున్నారు. సుమారు 18 ఏళ్ల క్రితం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రైతులు, కూలీలు ఆర్థికంగా ఎదిగేలా ఈ పథకం ఎంతగానో తోడ్పడే విధంగా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో డంపింగ్‌యార్డు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీల పెంపకం, మూగ జీవాలకు షెడ్ల నిర్మాణం తది తర పనులను అమలు చేస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం గల పథకాన్ని ఒక ప్రణాళిక ప్రకారం చేపట్టడానికి లక్ష్యాన్ని నిర్దేశించారు. గ్రామ స్థాయిలో ప్రజాభాగస్వామ్యంతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని గ్రామాభివృద్ధికి ఎలాంటి పనులు చేపట్టాలి.. ఎన్ని పనిదినాలు అవసరమవుతాయో నిర్ణయించారు. ఇందుకు సంబంధించి 2024-25 సంవత్సరానికి జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాలు, గ్రామాల వారీగా పనిదినాలు ఖరారు చేశారు.

జిల్లాలో ఈజీఎస్ పరిస్థితి...

జిల్లా వ్యాప్తంగా 8,521 శ్రమ శక్తి సంఘాలున్నాయి. జిల్లాలో 1,55,850 జాబ్ కార్డులు జారీ చేయగా, ఇందులో కూలీల సంఖ్య 2,82,748 మందిగా ఉంది. ప్రతీ యేటా సుమారు లక్ష కుటుంబాలకు ఈజీఎస్ ద్వారా పని కల్పిస్తున్నారు. ప్రతీ యేటా సుమారు రూ. 150 కోట్ల వ్యయాన్ని ఈజీఎస్ పనులకు వెచ్చిస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో ఫాం పాండ్, వార్మిక కాం పోస్ట్ పిట్, మ్యాజిక్ సోక్ పిట్స్, డ్రైయింగ్ ప్లాట్‌ఫాం, డంపింగ్ యార్డు, కిచెన్ షెడ్, స్కూల్ టాయిలెట్స్, శ్మశాన వాటికలు, సాయిల్డ్ వెస్ట్ మేనేజ్‌మెంట్ కంపోస్ట్ షెడ్, హరితహారం మొక్కల పెంపకం, స్వచ్ఛ భారత్ మిషన్ తదితర పనులను ఈజీఎస్ కింద నిర్వహిస్తున్నారు.

జిల్లా వ్యాప్తంగా ఈజీఎస్ పని దినాల ప్రణాళిక..

జిల్లా వ్యాప్తంగా 2024-25 సంవత్సరంలో 38,98, 590 పని దినాల లక్ష్యాన్ని అధికారులు ఖరారు చేశారు. ఇందులో బీర్‌పూర్ మండలంలో 1,42, 800 పని దినాలు, బుగ్గారంలో 1,57,203, ధర్మపురిలో 2,19, 804, గొల్లపల్లిలో 2,64,795, ఇబ్రహీంపట్నంలో 1,97, 801, జగిత్యాలలో 18,110, జగిత్యాల రూరల్ మండలంలో 2,12,400 పని దినాలను లక్ష్యంగా నిర్ణయించారు. అదేవిధంగా కథలాపూర్ మండలంలో 1,93,804 పని దినాలు, కొడిమ్యాలలో 2,86,307, కోరుట్లలో 1,46,800, మల్లాపూర్‌లో 2,28,787, మల్యాలలో 2,51, 929, మేడిపల్లిలో 3,07,650, మెట్‌పల్లిలో 1,93,605, పెగడపల్లిలో 2,37,213, రాయికల్‌లో 3,58,158, సారంగపూర్‌లో 1,50,828, వెల్గటూరు మండలంలో 3,30,536 ఈజీఎస్ పని దినాలను లక్ష్యంగా ప్రణాళిక రూపొందించారు.

పకడ్బందీగా పర్యవేక్షణ...

జిల్లా వ్యాప్తంగా సుమారు 2.82 లక్షల మంది కూలీలు ఉపాధి హామీ పథకంలో నమోదు చేసుకున్నారు. పనులకు వెళ్తున్న కూలీల వివరాలను పని ప్రదేశంలోనే సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్లు రోజు వారీగా నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్ ద్వారా నమోదు చేయాల్సి ఉంటుంది. పని ప్రదేశంలో ఒక్క కూలీ పని చేసినా పని ఫొటో, కూలీ వివరాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం సమయాల్లో కూలీలు, పనుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా ఎలాంటి అవకతవకలు లేకుండా పనులు పారదర్శకంగా జరపడానికి ప్రయత్నిస్తున్నారు.

వంద శాతం లక్ష్యం పూర్తి చేస్తాం

పి. నరేశ్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి



జిల్లాలో రానున్న 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు కల్పించాల్సిన పని దినాల ప్రణాళికను ఖరారు చేశారు. లక్ష్యం మేరకు వంద శాతం పని దినాలు కల్పించడానికి ప్రయత్నిస్తున్నాము. గ్రామీణ ప్రాంతాల్లో అవసరమయ్యే పనులను గ్రామ సభల ద్వారా నిర్ణయించి పూర్తి చేస్తాము. ప్రభుత్వ లక్ష్యం మేరకు కూలీలకు పనులు కల్పించనున్నాము.

గ్రామీణులకు వరంలా..

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి కూలీలు పెరిగే అవకాశం ఉండటంతో అందుకు తగినట్లుగా పని దినాలను పెంచడంతో పాటు బడ్జెట్‌ను కేటాయించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి అవసరమైన పనులను గుర్తించనున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాల్సిన పనులు, అందుకు అవసరమయ్యే కూలీల సంఖ్య, కేటాయించాల్సిన నిధులు, అవసరమయ్యే పని దినాలు తదితర వాటిని అధికారులు ప్రణాళికబద్ధంగా ఖరారు చేశారు.

అభివృద్ధి పనులకే మొగ్గు..

2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ప్రకారం చేపట్టాల్సి ఉంటుంది. ముఖ్యంగా గ్రామాభివృద్ధికి అవసరమైన పనులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఎక్కువగా నీటి నిల్వ పనులను చేపట్టనున్నారు. ముఖ్యంగా గ్రామాభివృద్ధికి అవసరమైన పనులను ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా ఇంకుడు గుంతలు, పశువుల షెడ్ల నిర్మాణం, నీటి తొట్ల ఏర్పాటు, నర్సరీల ఏర్పాటు, నీటి కుంటల నిర్మాణం, హరితహారం మొక్కలకు కంచెల ఏర్పాటు, మొక్కలకు నీరు పోసే పనులు తదితర గ్రామాభివృద్ధికి అవసరమయ్యే పనులను చేపట్టనున్నారు.

ఆటోలో అసెంబ్లీకి వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



ఆటోలో అసెంబ్లీ సమావేశానికి వెళ్తున్న జగిత్యాల, కోరుట్ల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

జగిత్యాల/మెట్‌పల్లి ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): ఆటో కార్మికుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు జగిత్యాల, కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఫ్లకార్డులు ప్రదర్శిస్తూ శుక్రవారం ఆటోలో అసెంబ్లీ సమావేశాలకు వెళ్లారు. జగిత్యాల, కోరుట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌లతో పాటు ఎమ్మెల్సీ ఎలగందుల రమణలు ఆటోలో ప్రయాణించారు. ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడకుండా ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ ఫ్లకార్డుల ప్రదర్శించారు. రాష్ట్రంలో మరణించిన ఆటో కార్మికులకు 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

పకడ్బందీగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలి

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా


కొండగట్టులో సంచులు అందజేస్తున్న కలెక్టర్

మల్యాల, ఫిబ్రవరి 9: జిల్లాలో పారిశుధ్య కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ షేక్ యాస్మిన్‌బాషా అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. మండలంలోని ముత్యంపేట గ్రామ పరిధిలో గల కొండగట్టులో శుక్రవారం నిర్వహించిన ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా దోమల నివారణకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అలాగే పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ తాగునీటి సరఫరా, క్లోరినేషన్, సమస్యలు తెలుసుకోవాలని అధికారులకు సూచించారు. ఇందుకు గాను ప్రత్యేకంగా అధికారుల బృందం ప్రజలకు వివరించాలని పేర్కొన్నారు. కలెక్టర్ దిగువ కొండగట్టులో దుకాణాలు ఇతరాత్ర పరిశీలించి పారిశుధ్యంపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బట్టతో తయారి చేసిన చేతి సంచులను అందజేశారు. స్వశక్తి మహిళలతో మాట్లాడారు. కలెక్టర్ వెంట డీపీవో దేవరాజ్, ఎంపీడీవో వెంకటేషం, పంచాయతీ కార్యదర్శి స్వప్న, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

జిల్లాలో 16 మంది ఎస్‌ఐల బదిలీలు

జగిత్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్‌లలో పనిచేస్తున్న 16 మంది ఎస్‌ఐలను బదిలీ చేస్తూ పోలీసు ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బుగ్గారంలో పనిచేస్తున్న ఎస్‌ఐ సందీప్‌ను కొడిమ్యాలకు, కొడిమ్యాల ఎస్‌ఐ వెంకట్రావును జగిత్యాల డీసీఆర్‌బీకి, జగిత్యాల డీఎస్‌బీ కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్‌ఐ అనిల్‌ను వెల్గటూరుకు, వెల్గటూరులో పనిచేస్తున్న ఎస్‌ఐ శ్వేతను కోరుట్ల ఎస్‌ఐ -2 గా, కోరుట్లలో ఎస్‌ఐ - 2గా పనిచేస్తున్న ఇంద్రసేనా రెడ్డిని జగిత్యాల టౌన్ ఎస్‌ఐ-2గా బదిలీ చేశారు. ధర్మపురిలో ఎస్‌ఐ-2గా పనిచేస్తున్న రామకృష్ణను పెగడపల్లికి, పెగడపల్లి ఎస్‌ఐ సతీష్‌ను గొల్లపల్లికి, గొల్లపల్లిలో పనిచేస్తున్న ఎస్‌ఐ నరేశ్‌కు మార్‌ను జగిత్యాల సీసీఎస్‌కు, జగిత్యాల డీఎస్‌బీలో పనిచేస్తున్న ఎస్‌ఐ శ్రీధర్ రెడ్డిని బుగ్గారంకు, కథలాపూర్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐ కిరణ్ కుమార్‌ను మల్లాపూర్ పోలీస్ స్టేషన్‌కు, మల్లాపూర్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐ నవీన్ కుమార్‌ను కథలాపూర్‌కు, జగిత్యాల టౌన్ ఎస్‌ఐ-1గా పనిచేస్తున్న అబ్దుల్ రహీంను మల్యాల ఎస్‌ఐ-1గా బదిలీ చేశారు. మల్యాల ఎస్‌ఐ అశోక్‌ను జగిత్యాల డీఎస్‌బీకి, ధర్మపురి ఎస్‌ఐ దత్తాద్రిని జగిత్యాలటౌన్ ఎస్‌ఐ-1గా, నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రెంజల్‌లో పనిచేస్తున్న ఎస్‌ఐ ఉదయ్‌కుమార్‌ను ధర్మపురి ఎస్‌ఐ-1గా, నిర్మల్ జిల్లా మామడ శ్రీకాంత్‌ను జగిత్యాల డీఎస్ బీ కార్యాలయానికి బదిలీ చేస్తూ హైద్రాబాద్ మల్టీ జోన్-2 ఐజీపీ కార్యాలయ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

పోలీసుల కళాజాతా ప్రదర్శన

రాయికల్, ఫిబ్రవరి 9: మండలంలోని మూటపెల్లి గ్రామంలో గురువారం రాత్రి ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ ఆదే శాల మేరకు రాయికల్ పోలీసుల ఆధ్వర్యంలో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు మూఢ నమ్మకాలు, ఆత్మహత్యల నివారణ, రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, గల్ఫ్ ఏజెంట్ మోసాలు, సైబర్ మోసాలు, నివారణపై అవగాహన కల్పించారు. సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అజయ్, మాజీ సర్పంచ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యవసాయ భూములను పరిశీలించిన అధికారులు

రాయికల్, ఫిబ్రవరి 9: మండలంలోని జగన్నాథ్‌పూర్‌లో వ్యవసాయ భూములను శుక్రవారం రెవెన్యూ అధికారులు ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి ఆదేశాల మేరకు పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టాలు లేని వ్యవసాయం చేసే రైతులకు అసైన్డ్ భూములను, పట్టాలు లేనివారికి పట్టాలు ఇచ్చే విధంగా కృషి చేస్తామన్నారు. ఆర్ఐ దేవదాస్, సర్వేయర్ రాజు, యువజన కాంగ్రెస్ నాయకులు పరాచ శంకర్, పటేల్ సుధాకర్, కృపాకర్ పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

జగిత్యాల మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్

జగిత్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని జగిత్యాల మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. మున్సిపల్ సమావేశంలో 16 అజెండా అంశాలను ప్రవేశపెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. జగిత్యాల పట్టణంలో గతంలో కంటే చాలా అభివృద్ధి పనులు చేసుకున్నామన్నారు. రాబోయే సీతారాముల కల్యాణం నిమిత్తం రూ. 10.80 లక్షలు, శివరాత్రి నిమిత్తము రూ. 11.40 లక్షలు, వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలకు రూ. 4.49 లక్షలు, రంజాన్ నిమిత్తం రూ. 13.70 లక్షలు కేటాయించామన్నారు. వేసవి కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా నీటి సరాఫరా, బోర్లు రిపేర్లు, ఇతర అభివృద్ధి పనులు చేయాలన్నారు. సమావేశంలో పలువురు సభ్యులు పలు సమస్యలను సమావేశంలో ప్రస్తావించగా సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో అభివృద్ధి పనులు నిర్వహించడానికి వివిధ వార్డుల్లో గతంలో టెండర్లు జరిగినప్పటికీ పలు ప్రారంభించడం లేదని బీజేపీ ఫ్లోర్ లీడర్ అనుమల్ల కృష్ణహరి, కౌన్సిలర్ పులి రమ అన్నారు. మున్సిపల్‌లో అవినీతి జరగకుండా చూడాలని, సానిటేషన్ విభాగం నందు మరమ్మతుల పేరిట ఖర్చులు, హరితహారంలో అవినీతి చోటుచేసుకుందని విచారణ జరిపించాలని, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కల్లెపల్లి దుర్గయ్య, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పర్వీన్ సుల్తానా, కౌన్సిలర్ నక్క జీవన్ కుమార్‌లు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనిల్, మున్సిపల్ ఇంజనీర్ యాదగిరి, టీపీవో శ్రీనివాస్, పలువురు అధికారులు, వివిధ వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ గోలి శ్రీనివాస్

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా


జగిత్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా ఉంటుందని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా అన్నారు. శుక్రవారం పట్టణంలోని విరూపాక్షి గార్డెన్స్‌లో టీఎస్ పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, జగిత్యాల జిల్లా పీఆర్‌టీయూ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదానం శిబిరానికి ఆమె హాజరయ్యారు. శిబిరంలో 33 మంది ఉపాధ్యాయులు రక్తదానం చేయగా సంబంధిత ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు అందించి, శాలువలతో సత్కరించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడారు. పిల్లలు సెల్ ఫోన్లకు అలవాటు పడి విద్యపై దృష్టి సారించడం లేదని, విద్యార్థులకు ఉపాధ్యాయుల పట్ల, తల్లిదండ్రుల పట్ల గౌరవ మర్యాదలు తగ్గిపోయాయని ఇటువంటి పరిస్థితుల్లో మార్పు తీసుకొని రావాలని సూచించారు. ఈకార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యాళ్ల అమర్‌నాథ్, నాయకులు బోయినిపల్లి ఆనంద్‌రావు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు మంచాల కృష్ణ, సిరిసిల్ల శ్రీనివాస్, టీవీ సూర్యం, టీఎస్‌జీవో నాయకులు బోగ శశిధర్ పాల్గొన్నారు.


రక్తదానం చేసిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కలెక్టర్

బీర్‌పూర్ లక్ష్మీనరసింహ స్వామి జాతర టెండర్లు

బీర్‌పూర్,ఫిబ్రవరి 9: శ్రీ లక్ష్మీనరసింహ స్వామి జాతర బ్రహ్మోత్సవల టెం డర్లు శుక్రవారం ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించా రు. ఈ నెల 19 నుంచి మార్చి 2వరకు అత్యంత వైభవంగా జరిగే జాతర బ్రహ్మోత్సవాలలో ఆయా సామగ్రి విక్రయించడం కోసం టెండర్లను నిర్వహించారు.

ఈ బహిరంగ వేళం టెండర్‌లలో లడ్డు, పులిహోరా రూపాయలు 3,35, 000. కొబ్బరికాయ బెల్లం రూపాయలు 2,16,000. పట్టెనామాలు కోరామీసాలు రూపాయలు 2,14,000. గండ దీపం రూ పాయలు 1,80,000. కొబ్బరి చిప్పల సేకరణ రూపాయలు 28,500 వ్యాపారులు బహిరంగ వేలం ద్వారా టెండర్లను దక్కించుకున్నారు. ఇదిలా ఉండగా బ్రహ్మోత్సవాల కోసం ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా ఉండేందుకు కావాల్సిన సౌకర్యాలను ఏర్పాటు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మసర్తి రమేష్, కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచంధర్ రావ్, వైస్ ఎంపీపీ బల్మూరి లక్ష్మన్‌రావ్, మాజీ జెడ్పీటీసీ కొల్మూల రమణ, ఉత్సవ కమిటి మెంబర్లు ఎనగంటి స్వామిట్, కొల్లూరి మల్లేశం, బదినపల్లి కాంత, గాజుల భూమయ్య, గుర్రం శ్రీనివాస్, ఎండోమెంట్ అధికారులు దేవాదాయ ప్రత్యేక అధికారి రవికిషన్, క్లర్క్ రాజయ్య, సిబ్బంది వెంకటేష్, మల్లయ్య పాల్గొన్నారు.



గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. శుక్రవారం హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని టీపీసీసీ ఎన్ఆర్ఐ సెల్ కన్వినర్ మంద భీంరెడ్డి, వసల కార్మికుల సంక్షేమ సంఘం నాయకురాలు సిస్టర్ లిజీ జోసెఫ్‌లు కలిసి సమస్యలను విన్నవించారు. ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో గల్ఫ్ సంక్షేమానికి తగిన నిధులు కేటాయించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్య మంత్రి మల్లు బట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబులను కలిసి గల్ఫ్ సంక్షేమ అంశాన్ని వారి దృష్టికి తీసుకవెళ్తానని హామీని చ్చారు. గల్ఫ్ మృతులకు టుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్ గ్రేషియా చెల్లింపు విషయం ఇదివరకే సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుక వెళ్లానని వివరించారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

గావ్ చలో బస్తీ చలో కార్యక్రమం

రాయికల్, ఫిబ్రవరి 9: రాయికల్ పట్టణంలోని 5వ వార్డుతో పాటు మండ లంలోని రామారావుపల్లె గ్రామాల్లో శుక్ర వారం బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో బస్తీ చలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న పథకాల గురించి ఇంటింటికీ తిరుగుతూ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మ పురి, ప్రధాన కార్యదర్శి కుంబోజి రవి, ఉపాధ్యక్షులు కునారపు భూమేష్, విఠల్, కార్యదర్శి సామల్ల సతీష్, నాయకులు సింగని సతీష్, కల్లెడ శేఖర్, ఎల్లా గౌడ్, సుమన్, కిషోర్, శంకరయ్య, మచ్చ నారాయణ, గోపాల్, రమేష్, కొక్కు, రాజు, కోటె మహేష్, రాహుల్, రాకేష్, పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం

మల్యాల, ఫిబ్రవరి 9: తాటిపల్లిలో గల మడేలయ్య గుడి సమీపంలో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. స్తంభం విరగడంతో దానికి ఇనుప పట్టీలు ఏర్పాటు చేశారు. దాని స్థానంలో కొత్తదాన్ని ఏర్పాటు చేయాల్సి ఉండగా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు తెలిపారు. అయిదేళ్లగా ప్రమాదకరంగా ఉండగా ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు


తాటిపల్లిలో విద్యుత్ స్తంభం

పెండింగ్ వేతనాలు ఇవ్వాలని ఆశా వర్కర్ల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలు

జగిత్యాల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి):పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ జగిత్యాలలో ఆశా వర్కర్లు ఆందోళన చేశారు. శుక్రవారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ప్రధాన గేటు వద్ద బైఠాయించి ధర్నా చేశారు. పెండింగ్‌లో ఉన్న డిసెంబరు 2023, జనవరి 2024 వేతనాలు వెంటనే చెల్లించాలని నినాదాలు చేశారు. సమ్మె సందర్భంగా గత ప్రభుత్వ ఆశా వర్కర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. అభయ హస్తం, మహాలక్ష్మీ తదితర అదనపు పనులు ఆశా వర్కర్లతో చేయించకూడదన్నారు. టార్గెట్స్ పెట్టి ఆశాలను భయభ్రాంతులకు గురిచేసే విధానాన్ని రద్దు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం నాయకులు లత, పద్మ, మమత, జ్యోతి, వనిత, దివ్య పాల్గొన్నారు.

అదనపు కట్నం కోసం వేధించిన వారిపై కేసు

కొడిమ్యాల, ఫిబ్రవరి 9: అదనపు కట్నం కావాలంటూ నిత్యం వేధిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు కొడిమ్యాల హెడ్‌కానిస్టేబుల్ అర్షరాజు శనివారం తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని నమిళికొండ గ్రామానికి చెందిన లావణ్యకు సిరిసిల్ల పట్టణానికి చెందిన పల్లెపు కుమార్‌తో ఐదేళ్ల క్రితం వివాహం జరిగింది. పెళ్లి సమయంలో కట్నంగా ఐదు తులాల బంగారు నగలు, ద్విచక్ర వాహనం అందించారు.

వీరికి ఒక కూతురు జన్మించింది. రెండు సంవత్సరాల నుంచి లావణ్యను రెండు లక్షల రూపాయల అదనపు కట్నం తీసుకరావాలని భర్త పల్లెపు కుమార్, అత్తమామ, ముగ్గురు ఆడపడుచులు, మానసికంగా వేధిస్తున్నారంటూ లావణ్య చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 9: మంకమ్మతోటలో ఒక ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్న ఒక మహిళను అరెస్టు చేశామని రెండో టౌన్ సీఐ వెంకటేష్ తెలిపారు. విటుడు రాజు, యువతులను తీసుకువస్తున్న వ్యక్తి ప్రశాం త్, ఇంటి యజమాని రూప్‌సింగ్‌లపై కేసు నమోదు చేవామని తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 9 : సప్తగిరి కాలనీలో పేకాట ఆడుతున్న ఆరుగురు పేకాటరాయుళ్లను శుక్రవారం అరెస్టు చేశామని రెండో టౌన్ సీఐ వెంకటేశ్ తెలిపారు. పట్టుబడినవారి వద్ద నుంచి 36,070 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

కాలువలోపడి యువకుడి గల్లంతు

చొప్పదండి, ఫిబ్రవరి 9: చొప్పదండి పట్టణ శివారులోని డి-86 కాలువలో పడి యువకుడు గల్లంతు అయినట్లు ఎస్‌ఐ ఉపేంద్రచారి తెలిపారు. షేక్ యూసుఫ్(25) బంధువుతో కలిసి శుక్రవారం సాయంత్రం చిల్లవాడ సమీపంలో డి-86 కాలువ మెట్ల వద్ద స్నానం చేస్తుండగా ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరగడంతో నాటిలో గల్లంతు అయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెద్దపాపయ్యపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 9: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామపంచాయతీ కార్యదర్శి బి. ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. న్యాయబద్ధమైన విధులను విస్మరించి, అసభ్యంగా ప్రవర్తించడం, అసభ్య పదజాలం ఉపయోగించడం, ఉన్నతాధికారుల ఆదేశాలను ధిక్కరించినందుకు గాను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మంథని నుంచే పీవీ రాజకీయ ప్రస్థానం

- 1957 నుంచి నాలుగుసార్లు మంథని ఎమ్మెల్యేగా వరుస విజయాలు - ఉమ్మడి ఏపీలో వివిధ శాఖల మంత్రిగా, సీఎంగా సేవలు- పీవీకి భారతరత్న ప్రకటించిన కేంద్రప్రభుత్వం



మంథని, ఫిబ్రవరి 9: మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నర్సింహారావు మంథని నుంచి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. మాజీ ప్రధానమంత్రి పీవీ దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం దేశంలో అత్యున్నమైన భారతరత్న అవార్డును ప్రకటించిన నేపథ్యంలో శుక్రవారం మంథని ప్రాంత వాసులు, రాజకీయ పార్టీల నేతలు మంథని తో పీవీకి ఉన్న అనుబంధాన్ని మరో మారు నెమరువేసుకున్నారు. 20 ఏళ్లపాటు ప్రజలు, కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష పార్టీల నేతలు, అధికారులతో కలిసిమెలిసి మంథనిలో పీవీ నర్సింహారావు రాజకీయ కార్యకలాపాలు కొనసాగించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు 1957లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంథని నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పీవీ నర్సింహారావు పోటీచేసి ఘనవిజయ సాధిం చి తన రాజకీయాల్లో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. అనతరం జరిగిన 1962, 1967, 1972 శాసనసభ ఎన్నికల్లో మంథని నుంచి వరుసగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పీవీ గెలుపొందారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం లో వైద్య ఆరోగ్యశాఖ, విద్యా శాఖల మంత్రిగా, కొద్దినెలల పాటు సీఎంగా సేవలందించారు. అనంతరం ఎంపీగా పోటీచేసి దేశ రాజకీయాల్లో అరంగేట్రం చేశారు. పలుమార్లు ఎంపీగా గెలుపొంది కేంద్రమంత్రిగా, ప్రధానమంత్రిగా పనిచేసి ప్రజాపాల నలో తన రాజకీయ చతురతను చాటుకున్నారు. మంథని పట్టణానికి విద్యుత్ కల్పన, గోదావరినది నుంచి తాగునీరు అందించడానికి పైప్‌లైన్, నల్లా కనెక్షన్లు, బొక్కలవాగుపై వంతెన నిర్మాణం, అడవిసోమన్‌పల్లి వద్ద మానేరు నది భారీ వంతెన నిర్మాణం తోపాటు అనేక రోడ్లు, విద్యా, వైద్య సేవలను విస్తరించడానికి పీవీ ఎనలేని కృషి చేశారు.

పెద్దపల్లి జడ్పీ ఛైర్మన్ పుట్ట మధు మంథని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా మంథని పాత పెట్రోల్ పంపు చౌరస్తాలో పీవీ నర్సింహారావు విగ్రహాన్ని ఏర్పాటు ప్రతిష్ఠించి ఘనంగా ఆవిష్కరించారు. పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న అవార్డు ప్రకటించడంపై మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జడ్పీ ఛైర్మన్ పుట్ట మధు, కాంగ్రెస్ పార్టీ నేతలు శుక్రవారం వేర్వేరుగా హర్షం వ్యక్తం చేశారు. స్థానిక పీవీ విగ్రహానికి బెజ్జంకి డిగంబర్, మేడగోని రాజమౌళిగౌడ్, రామడుగు మారుతి తదితరులు పూలమాలలు వేసి నివాళుల్పించారు.

● నాటి 'రాజన్న' ధర్మకర్తకు భారతరత్న

వేములవాడ: ఒకప్పుడు వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తగా సేవలందించిన దివంగత మాజీ ప్రధాని పాముల పర్తి వెంకట నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం దేశంలోనే అత్యున్నతమైన భారతరత్న పురస్కారం ప్రకటించడంపై వేములవాడ వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం ధర్మకర్తగా ఈ ప్రాంతంతో అనుబంధం కలిగి ఉన్నాడు. 1956లో అప్పటి రాజన్న ఆలయ ట్రస్ట్ అధ్యక్షుడు రేగులపాటి అనంత రావుతో పాటు రాజన్న ఆలయ ట్రస్ట్ సభ్యులుగా పీవీ నరసింహారావు కొనసాగారు. 1990లలో వేములవాడ రాజన్న దర్శనానికి కూడా వచ్చారు. అప్పటి ఎంపీ చొక్కారావు ఈ సందర్భంగా పీవీ నరసింహారావును రాజన్న ఆలయంలో సన్మానించి స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. పీవీ నరసింహారావు కు భారతరత్న పురస్కారం ప్రకటించడంపై బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, విశ్వహిందూ పరిషత్ నాయకుడు డాక్టర్ మధు రాధాకిషన్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

జయహో పీవీ.. భారతదేశపు ఠీవి

కరీంనగర్ కల్చరల్: ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన మాజీ ప్రధాని, బహుభాషా కోవిదుడు, సాహితీవేత్త పాములపర్తి వేంకట నరసింహారావును దేశ అత్యున్నత పురస్కారం 'భారతరత్న' ప్రకటించగా కొందరు సాహితీవేత్తలు ఈ సందర్భంగా వారి అభిప్రాయాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.



పీవీ నరసింహారావును సత్కరిస్తున్న నాటి ఎంపీ చొక్కారావు(ఫైల్)

● సముచిత గౌరవం దక్కింది

- డాక్టర్ గంద్ర లక్ష్మణరావు, సాహితీవేత్త, అవధాని



పీవీకి సముచిత గౌరవం దక్కింది. యావత్ దక్షిణ భారతదేశంతో పాటు తెలుగువారందరూ గర్వించదగ్గ విషయం. ఆర్థికంగా దిగజారుతున్న దేశ ఆర్థిక వ్యవస్థను తన మేధాశక్తితో పునరుద్ధరించిన గొప్ప రాజనీతిజ్ఞుడు. జాతిని నిద్ర లేపి పురోగమింపజేయడం నా కల అని జీవితాన్ని ప్రజలకు అంకితం చేసిన నిస్వార్థ రాజకీయ నాయకుడు. సాహితీవేత్తగా కూడా తగినంత గౌరవం లభించాల్సి ఉంది.

● అర్హత గల వ్యక్తుల్లో అగ్రగణ్యులు

- డాక్టర్ నలిమెల భాస్కర్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, కరీంనగర్



పురస్కారానికి పీవీ సర్వ విధాల అర్హత గల వ్యక్తుల్లో అగ్రగణ్యుడు. భారతీయులు, తెలుగువారు మరచిపోలేని ఓ అరుదైన, అపూర్వ, మధుర ఘట్టం. కరీంనగర్ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో ఇనుమడింపజేసిన ఆయన ఘనత మరింత ఉన్నత శిఖరాలకు చేరింది. రాజనీతిజ్ఞత, భూ, ఆర్థిక సంస్కరణలు, మాతృభాషా విద్యావిధానం వంటి అంశాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఆయన గొప్ప సృజనకారుడు. ఆయన రచనల్లో, అనువాదాల్లో అప్పుడే తెలంగాణ ముద్ర స్పష్టంగా కనిపించేది. గొల్ల రామవ్వ కథే కాకుండా ఆయన రాసిన హాస్య, వ్యంగ్య, రాజకీయ, అధిక్షేప నవల 'మంగయ్యగారి అదృష్టం'.

● పీవీ కుటుంబ సభ్యుడిగా గర్విస్తున్నా

-కేవీ సంతోష్‌బాబు, పీవీ సాహిత్యపీఠం అధ్యక్షుడు, కరీంనగర్



పీవీ తమ్ముడి అల్లుడిగా గర్విస్తున్నా. 2017లో పీవీ సాహిత్యపీఠం నెలకొల్పి ప్రతీ యేటా పురస్కారాలిస్తున్నాం. రచయితలకు కూడా ఎంతో గర్వకారణం.

● ఒక లోటు భర్తీ అయింది...

- వారాల ఆనంద్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, కరీంనగర్



పీవీ తన జీవితంలో అందుకోని శిఖరాలు లేవు. భారతరత్న పురస్కారంతో ఒక లోటు భర్తీ అయింది. భాషా సాహిత్య పరంగా ఆయన సేవలు అమోఘం. నవీన ఆర్థిక వ్యవస్థలో ఆయన ఒక కొత్త ఒరవడి సృష్టించారు.

● పీవీకి భారతరత్న ఇవ్వడం భేష్..

- ఎంపీ బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ టౌన్: మాజీ ప్రధాని స్వర్గీయ పీవీ నర్సింహారావు రాజకీయాలకు అతీతంగా దేశానికి చేసిన సేవలను గుర్తించి దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడం అభినందనీయం. ఈ పురస్కారాన్ని అందించిన మోదీ ప్రభుత్వానికి ధన్యవాదాలు. తెలుగు ప్రజలకు ప్రత్యేకించి తెలంగాణకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాం. పీవీ నర్సింహారావును కాంగ్రెస్ పార్టీ పూర్తిగా విస్మరించింది. బీఆర్ఎస్ కేవలం రాజకీయ లబ్ధికే వాడుకున్నది.

● తెలంగాణకు దక్కిన అరుదైన గౌరవం

- మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్

తెలంగాణ ముద్దుబిడ్డ, భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ప్రకటించడం తెలంగాణకు దక్కిన అరుదైన గౌరవం. గతంలోనే బీఆర్ఎస్ పార్టీ పీవీ నర్సింహారావుకు భారత రత్న ప్రకటించాలని డిమాండ్ చేసింది.

● జిల్లా వాసులకు గర్వకారణం..

- మేయర్ యాదగిరి సునీల్‌రావు

భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారత రత్న అవార్డును ప్రకటించడం హర్షణీయం. జిల్లా వాసులకు గర్వకారణం. మాజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పీవీకి భారతరత్న ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. మోదీ సర్కార్‌కు నగరప్రజల పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నాం.

పీవీ పేరిట వెలిసిన ఓ గిరిజన గ్రామం

మంథని: చుట్టూ పరుచుకున్న పచ్చటి అడవి.. పక్కనే మానేరు జల తరంగాలు.. లోకం పోకడలు పెద్దగా తెలియని అమాయక గిరిజనులకు ఆవాస కేంద్రం.. వెరసి.. మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ పీవీ నర్సింహారావు పేరిట ఓ గ్రామం ఆవిర్భవించింది. పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని మల్హర్ మండలం కొయ్యూరు గ్రామపంచాయతీ పరిధిలో పీవీనగర్‌ను దాదాపు 55 ఏళ్ల క్రితమే గిరిజనులు ఏర్పాటు చేసుకున్నారు. జిల్లా పునర్విభజనలో భాగంగా ప్రస్తుతం మల్హర్ మండలం పరిపాలనపరంగా భూపాలపల్లి జిల్లాలో కొనసాగుతోంది. పెద్దపల్లి-భూపాలపల్లి జిల్లాల సరిహద్దుగా ఉన్న మంథని-మల్హర్ మండలాల్లోని మానేరు నది ఒడ్డున గిరిజనులు పీవీనగర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా పీవీ 1971లో మానేరు నదిపై భారీ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి నియోజకవర్గంలో తొలి బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయించారు. మంథని పట్టణ శివారులోని బొక్కలవాగుపై సైతం వంతెన నిర్మించారు. బ్రిడ్జి నిర్మాణం సమయంలో తమకు చాలా కాలంపాటు ఉపాధి లభించడంతోపాటు తరుచూ మానేరునది వరదల ముంపుతో సతమతమైన అడవిసోమన్‌పల్లి గ్రామానికి చెందిన యాకపోడు అనే గిరిజన తెగకు చెందిన ప్రజలు ఆ బాధ లేకుండా ఉండటానికి బ్రిడ్జి అవతలి వైపు అనువుగా ఉన్న స్థలంలో నూతనంగా గ్రామాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ స్థలం రిజర్వు ఫారెస్టుది కావడంతో అటవీ శాఖ అధికారుల నుంచి ఇబ్బందులు లేకుండా పీవీ చొరవ తీసుకొని గిరిజనులు ఊరిని ఏర్పాటు చేసుకోవడానికి సహకరించారు. దీంతో గిరిజనులంతా ఆయన పేరిట పీవీ నగర్ నామకరణం చేసుకున్నారు. ప్రస్తుతం గ్రామంలో 52 యాకపోడు అనే గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. నాటి నుంచి పీవీ నగర్‌గా మంథని-కాటారం ప్రధాన రహదారి పక్కనే దర్శిమిస్తోంది.



పీవీ నగర్ విలేజ్ వ్యూ

జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక



విద్యార్థులతో డీఈవో జనార్దన్‌రావు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 9: బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో ఈ నెల 13 నుంచి 16 వరకు జరగనున్న జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు నగునూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 3,4 తేదీల్లో జిల్లా కేంద్రంలోని సప్తగిరి ఉన్నత పాఠశాలలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన ఇద్దరు క్రీడాకారులు డి.శృతి, టి. భానుప్రసాద్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని జిల్లా ఎస్‌జీఎఫ్ ప్రధాన కార్యదర్శి పోతన శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం డీఈవో సీహెచ్ జనార్దన్‌రావు క్రీడాకారులను అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటి పతకాలతో తిరిగి రావాలన్నారు. కార్యక్రమంలో కేజీఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాత కక్షలతోనే హత్య

16 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

నిందితుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

కోరుట్ల ఫిబ్రవరి 9 : కోరుట్ల పట్టణంలోని అర్బన్ కాలనీలో గురువారం జరిగిన హత్య కేసును పోలీసులు 16 గంటల్లో ఛేదించారు. హత్యకు పాత కక్షలే కారణమని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. నిందితుడిని శుక్రవారం అరెస్ట్ చేశారు. కోరుట్ల సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య కేసుకు సంబంధించిన వివరాలను సీఐ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన వాసాల రఘుకు వెంకటరమణ(55)కు కొద్ది రోజులుగా పాత కక్షలు ఉన్నాయి. దీంతో పాటు తన తల్లిపై అసభ్యంగా ప్రచారం చేస్తున్నాడని కొన్ని సార్లు వెంకటరమణతో రఘు గొడవ పడ్డాడు. పెద్దమనుషుల సమక్షంలో ఇదే విషయమై పలుసార్లు పంచాయితీలు జరిగినా వెంకటరమణ ప్రవర్తన మారలేదు. దీంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో రఘుపై తప్పుడు సమాచారం ఇచ్చి కేసు నమోదుకు వెంకటరమణ కారకుడయ్యాడు. అటు తల్లిపై అసభ్యంగా ప్రచారం చేయడంతో పాటు తనపై కేసు పెట్టించడంతో వెంకటరమణపై రఘు పగ పెంచుకుని హత్యకు వ్యూహం రచించాడు. ఈనెల 8వ తేదీన సాయంత్రం వెంకటరమణ కాలనీకి వచ్చి వెలుతున్న సమయంలో అక్కడే మాటు వేసి ఉన్న రఘు తన వెంట తెచ్చుకున్న కత్తితో వెంకటరమణపై దాడి చేసి హతమార్చాడు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యాడు. కాలనీవాసులు, మృతుడి భార్య ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడు రఘు అర్బన్ కాలనీలోని తన ఇంటి వద్ద ఉన్నాడనే సమాచారంతో ఎస్సై కిరణ్‌కుమార్ తన సిబ్బందితో వెళ్లి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. హత్యకు వాడిన కత్తితో పాటు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణలో చాకచక్యంగా వ్యవహరించిన కోరుట్ల ఎస్ఐ కిరణ్ కుమార్, కానిస్టేబుళ్లు విజయ్, సతీష్‌లను సీఐ ప్రవీణ్ కుమార్ అభినందించారు.



నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ ప్రవీణ్ కుమార్

చిన్నారి అపహరణకు యత్నించిన గుర్తు తెలియని వ్యక్తిపై కేసు

సిరిసిల్ల క్రైం, ఫిబ్రవరి 9: సిరిసిల్ల పట్టణంలోని ఓ పాఠశాల వద్ద మూడో తరగతి విద్యార్థినికి చాక్ లెట్ ఆశ చూపి అపహరించేందుకు యత్నించిన గుర్తు తెలియని వ్యక్తిపై కేసు నమోదు చేశమని టౌన్ సీఐ రఘుపతి శుక్రవారం తెలిపారు.

పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలోని ఓ పాఠశాల వద్దకు వెళ్లిన ఆగంతకుడు ఎనిమిదేళ్ల బాలికకు చాక్ లెట్ ఇచ్చి అపహరించేందుకు యత్నించాడు. ఆగంతకుడి చేయి కొరికి బాలిక తప్పించుకుంది. అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించినా పరారయ్యాడు. పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయుడు జాషువా ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని తెలిపారు.

మొలంగూర్ ఖిల్లాను అభివృద్ధి చేయాలి

శంకరపట్నం, ఫిబ్రవరి 9: శంకరపట్నం మండలం మొలంగూర్ ఖిల్లాను అభివృద్ధి పరచాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కో-ఆర్డినేటర్ జక్కని సంజయ్‌కుమార్ కేంద్ర పర్యటక శాఖ కార్యదర్శి వి విద్యావతి, రాకేష్‌కుమార్‌వర్మలకు వినతిపత్రం సమర్పించినట్లు శుక్రవారం తెలిపారు. మొలంగూర్ ఖిల్లా ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగా శిథిలావస్థకు చేరిందన్నారు. ప్రభుత్వం స్పందించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు బొంగోని అభిలాష్‌గౌడ్, చంద్రకాంత్ తదితరులు పాల్గన్నారు.

తాళం వేసి ఉన్న మూడిళ్లలో చోరీ

- ఐదు తులాల బంగారం, 20 తులాల వెండి, 27 వేల నగదు అపహరణ



పరిశీలిస్తున్న ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి

కోనరావుపేట, ఫిబ్రవరి 9: తాళం వేసి ఉన్న ఇండ్లే టార్గెట్ చేసి గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడుతున్నారు. కోనరావుపేట మండలం మర్తనపేట గ్రామంలో మూడిళ్లకు తాళం వేసి ఉండడంతో ఆ ఇళ్లలో చోరీకి పాల్పడి ఐదు తులాల బంగారం, 20 తులాల వెండి, 27 వేల నగదును అపహరించారు. గ్రామానికి చెందిన బోనాల నర్సయ్య ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లారు. తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడి ఐదు తులాల బంగారం, 20 తులాల వెండి, 25 వేల నగదును దోచుకెళ్లారు. కాగా తాళం వేసి ఉన్న గుమ్మడిదారి గౌరవ్వ ఇంట్లో రెండు వేల రూపాయలు నగదు, అలాగే మరో ఇంట్లో కూడా ఇదే విధంగా చోరీకి పాల్పడ్డారు. ఈ ఇంట్లో ఏమి దొరకకపోవడంతో వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న కోనరావుపేట ఎస్సై అంజనేయులు, ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి గ్రామానికి చేరుకొని చోరీకి పాల్పడిన తీరును పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తప్పిపోయిన బాలుడు: తల్లిదండ్రులకు అప్పగింత



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న అధికారులు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 9: పశ్చిమబెంగాల్ రాష్ట్రం కోల్ కతాకు చెందిన బాలుడు కిషన్‌కుమార్(12)ను చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ద్వారా జిల్లా బాలల సంక్షేమ సమితి(సీడబ్ల్యుసీ) ఆధ్వర్యంలో అతని తల్లిదండ్రులకు అప్పగిం చారు. ఈ నెల 3న కరీంనగర్ ఫిష్‌మార్కెట్‌లో కిషన్‌కుమార్(12) అనే బాలుడు అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఒకటో టాణా పోలీసులు గుర్తించి వివరాలు సేకరించారు. సరైన సమాధానం రాకపోవటంతో సీడబ్ల్యుసీ ద్వారా ఓపెన్ షెల్టర్ ఫర్ బాయ్స్‌లో ఉంచారు. ఓపెన్ షెల్టర్ హోం సిబ్బంది బాలుడి వివరాలను అడగగా తనది పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కత్తా అని చెప్పడంతో వెంటనే సీడబ్ల్యుసీ అధికారులు వివరాలు సేకరించి బాలుడి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. బాలుడి తల్లిదండ్రులు శుక్రవారం కరీంనగర్‌కు చేరుకుని వారి కొడుకు ఆధారాలు చూపడంతో వారికి అప్పగించారు. బాలుడు కోల్‌కతాలో 4వ తరగతి వరకు చదివి కుటుంబ ఆర్థిక ఇబ్బందులు, కుటుంబంలో గొడవల కారణంగా చదువు మానేశాడు. ఫిబ్రవరిలో తన అమ్మమ్మతో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్న దగ్గరి బంధువుల వద్దకు రైల్‌లో వస్తుండగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో తప్పిపోయాడు. తప్పిపోయిన బాలుడు చివరకు కరీంనగర్‌కు చేరుకున్నాడు. బాలుడు తెలిపిన వివరాలతో బాలల సంక్షేమ సమితి అధికారులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యుసీ ఛైర్ పర్సన్ ధనలక్ష్మి, సభ్యులు రేండ్ల కళింగ శేఖర్, అర్చన, రాధ, విజయ్, చైల్డ్‌హెల్ప్ లైన్ 1098కు చెందిన సాయికిరణ్, ప్రియాంక, స్వప్న పాల్గొన్నారు.

రాజన్నపేటలో శిలాఫలకం ధ్వంసం

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 9: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో ఇటీవల మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చేతుల మీదుగా ఆవిష్కరించిన ప్రగతి ప్రాంగణం శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు గురువారం అర్ధరాత్రి ధ్వంసం చేశారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, తిరుపతి, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణమూర్తి, సురేందర్ తదితరులు ఉన్నారు.

● కేసు నమోదు..

రాజన్నపేటలోని ప్రగతి ప్రాంగణం శిలాఫలకాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంపై కేసు నమోదు చేశామని ఎస్సై రమాకాంత్ శుక్రవారం తెలిపారు. గ్రామ శివారులోని ప్రగతి ప్రాంగణం శిలాఫలకాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో రూ.20వేల నష్టం వాటిల్లిందని పేర్కొంటూ గ్రామపంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్న గోసికంటి రవి ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు.

నేడే నవోదయ ప్రవేశ పరీక్ష

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

చొప్పదండి, ఫిబ్రవరి 9: నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీచేసేందుకు శనివారం ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ మంగతాయరు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్ష పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని అన్నారు. ఉమ్మడి జిల్లాలోని 1,745 మంది విద్యార్థులు 9వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోగా, 1144 మంది విద్యార్థులు 11వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. వీరి కోసం కరీంనగర్‌లో 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలని సూచించారు.

రాజన్న ఆలయంలో దొంగ చేతివాటం

- చితకబాదిన భక్తులు



యాత్రికులకు నగదు తిరిగి అందజేస్తున్న ఆలయ భద్రతా సిబ్బంది

వేములవాడ, ఫిబ్రవరి 9: వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఓ మహిళ మెడలోని పుస్తెలతాడును దొంగిలించడానికి యత్నించిన ఓ వ్యక్తిని భక్తులు పట్టుకున్నారు. శుక్రవారం ఉదయం ఆలయ క్యూలైన్లో ఒక భక్తురాలి మెడలోంచి పుస్తెలతాడును అపహరించేందుకు యత్నించగా గుర్తించిన భక్తులు సదరు వ్యక్తిని పట్టుకుని చితకబాది ఆలయ భద్రతా సిబ్బందికి అప్పగించారు. ఈ సందర్భంగా సదరు దొంగను విచారించిన క్రమంలో అంతకుముందు సదరు దొంగ మరో యాత్రికుడి వద్దనుంచి 5,000 రూపాయలను దొంగిలించినట్లు గుర్తించారు. 5,000 రూపాయలను భూపాల్‌పల్లి మండలానికి చెందిన సంతోష్ అనే భక్తుడి వద్ద దొంగలించినట్లు గుర్తించి ఆ సొమ్మును ఆలయ భద్రతా సిబ్బంది అతనికి తిరిగి అందజేశారు. దొంగతనానికి పాల్పడిన వ్యక్తి కరీంనగర్ సమీపంలోని చింతకుంటగా గుర్తించామన్నారు. అనంతరం పట్టణ పోలీసులకు అప్పగించామని ఆలయ ఎస్పీఎఫ్ సిబ్బంది తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

శంకరపట్నం, ఫిబ్రవరి 9: మండలంలోని మొలంగూర్ గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట శివకుమారి అనే మహిళ ఒంటిపై పెట్రోల్ పోసుకొని శుక్రవారం ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి పర్మిషన్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. ఇల్లు పర్మిషన్ ఇవ్వకుండా పంచాయతీ కార్యదర్శి మమత వేధిస్తోందని ఆరోపించారు. ఈ విషయంపై ఎంపీడీవో శ్రీవాణిని వివరణ కోరగా ఇంటి నిర్మాణానికి సంబంధించి సరైన ధ్రువపత్రాలు లేనందున పర్మిషన్ ఇవ్వలేదని తెలిపారు.

పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య



రాంచందర్ (ఫైల్)

గన్నేరువరం, ఫిబ్రవరి 9: మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామాని కి చెందిన కొర్వి రాంచందర్(36) అనే యువకుడు పెళ్లికావడం లేదనే మనస్తాపంతో గురువారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొర్వి రాంచందర్ తనకు సరైన జీవనోపాధి లేకపోవడంతో పెళ్లి చేసుకోలేదు. సంవత్సరం క్రితం కరీంనగర్ ఫ్యామిలీ కోర్టులో అటెండర్‌గా ఉద్యోగం రావడంతో విధులు నిర్వహిస్తున్నాడు. ఉద్యోగం చేస్తున్నా తనకు పెళ్లి కుదరడం లేదని రెండు నెలలుగా విధులకు వెళ్లకుండా మనస్తాపానికి గురై గురువారం రాత్రి తన ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. తన కొడుకు తరచూ పెళ్లికావడం లేదని బాధపడుతుండే వాడని దీంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి తల్లి కొర్వి సుగుణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నరసింహారావు తెలిపారు.

బావిలో దూకి వ్యక్తి ..

శంకరపట్నం, ఫిబ్రవరి 9: మండలంలోని కరీంపేట గ్రామానికి చెందిన మహ్మద్‌గౌస్ (32) అనే యువకుడు గురువారం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని బావిలో నుంచి వెలికి తీశారు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బెల్లంపల్లికి చెందిన గౌస్ శంకరపట్నం మండలం కరీంపేటకు చెందిన కరిష్మాను వివాహం చేసుకొని కరీంపేటలోనే కూలీ పనులు చేసుకుంటూ భార్యా పిల్లలతో జీవనాన్ని కొనసాగిస్తున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి తాగుడుకు బానిసై కూలీ డబ్బులు తాగుడికే ఖర్చు చేసేవాడు. కుటుంబ బాధ్యతలు పట్టించుకునే వాడు కాదు. గురువారం మృతుడు గౌస్ తన భార్యతో అమ్మమ్మ, తాత దగ్గరికి వెళ్తున్నానని చెప్పి కరీంపేట గ్రామ శివారులో గల వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కరిష్మా, ఇద్దరు అమ్మాయిలు, ఒక అబ్బాయి ఉన్నారు. మృతుడి భార్య కరిష్మా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. దహన సంస్కారాలకు కూడా డబ్బులు లేకపోవడంతో గ్రామంలోని యువకులు చందాలు వేసి అంత్యక్రియలు నిర్వహించారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



విచారణ జరుపుతున్న డీఎస్పీ ఉదయ్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 9: మండల కేంద్రంలో ఇటీవల నమోదైన ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుపై సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయం ఖాళీ స్థలంలో గొల్లపల్లికి చెందిన దాసరి కృష్ణంరాజు టీ కొట్టు నడుపుకుంటు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. టీ కొట్టు చుట్టు రేకులు అమర్చుకోవడం కోసం బండ రాళ్లు పేర్చుతుండగా మండల కేంద్రానికి చెందిన సందుపట్ల రాంరెడ్డి, సందుపట్ల రాజిరెడ్డి, సందుపట్ల సత్తవ్వ, సందుపట్ల లక్ష్మారెడ్డి, సందుపట్ల పద్మారెడ్డి, మోగి ఆగయ్య ఖాళీ స్థలం తమదని పేర్కొంటూ ఇటీవల కులం పేరుతో దూషిస్తూ చంపుతామని బెదిరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సిరిసిల్ల డీఎస్పీ ఉదయ్‌రెడ్డి ఘటన స్థలంలో ఇరువర్గాలను విచారించారు. వారి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. నిజనిర్ధారణ చేసి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ ఉదయ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన వెంట ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రమాకాంత్ ఉన్నారు.

రేపు గ్రూప్స్ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 9: హైదరాబాద్‌కు చెందిన విష్ణు ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 11న గ్రూప్స్ పరీక్షలపై ఉచిత అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలను తెలియజేశారు. స్థానిక టీఎన్‌జీవో ఫంక్షన్ హాలులో ఉదయం 10 గంటలకు తెలంగాణ గ్రూపు-1 ఆఫీసర్స్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి నూతనకంటి వెంకట్, విన్నర్ పబ్లికేషన్ డైరెక్టర్ ప్రసన్న హరికృష్ణ, విష్ణు ఐఏఎస్ అకాడమీ డైరెక్టర్ విష్ణువర్ధన్, జిల్లా ట్రెజరీ అధికారి ఎన్ నవీన్‌కుమార్ పాల్గొని పరీక్షల తీరు ప్రక్రియను పూర్తిస్థాయిలో వివరిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పరీక్ష ఫలితాలు విడుదల

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 9: ఎస్‌యూ పరిధిలోని డిగ్రీ డిజైన్ టెక్నాలజీ, హానర్స్ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఎస్‌యూ పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎస్‌వి శ్రీరంగప్రసాద్ తెలిపారు. ఫలితాలను www.Satavahana.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని తెలిపారు.

తొలి తెలుగు ప్రధానికి

భారతరత్న గర్వకారణం

కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు



మెట్‌పల్లి, ఫిబ్రవరి, 9: తెలుగు జాతి కీర్తి ప్రతిష్ఠలను ప్రపంచ నలు మూలలు చాటి చెప్పిన తెలంగాణ తెలుగు తొలి తెలుగు బిడ్డ మాజీ ప్రధాన మంత్రి, మెట్‌పల్లి ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్ మాజీ ఛైర్మన్ పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న పురస్కారం ప్రకటించడం ఎంతో గర్వకారమని కోరు ట్ల మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. శుక్రవారం ఆయ న విలేకరులతో మాట్లాడుతూ వరంగల్ జిల్లా నర్సంపేట మండలానికి చెందిన పీవీ నర్సింహారావు తెలంగాణ బిడ్డగా 1991-96 వరకు పీవీ నర సింహారావు ప్రధాని కావడం చాలా ప్రత్యేకతలున్నాయి. సౌతిండియా నుంచి ప్రధాని అయిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించారన్నారు. ప్రధాని అయిన తర్వాత ఓసారి హైదరాబాద్‌కు వచ్చినప్పుడు ఢిల్లీకి రాజైనా తల్లికి బిడ్డేనంటూ చేసిన వ్యాఖ్యలు పాపులర్ అయ్యాయన్నారు. ఆయన మెట్‌పల్లి ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్‌కు 1967 నుంచి 1983 వరకు ఛైర్మ న్‌గా ఎనలేని సేవలు అందించారన్నారు. రైతుల హక్కులు, సంక్షేమం కోసం తన జీవితమంతా అంకితం చేసిన పీవీ నరసింహారావుకు భారత రత్న పురస్కారం లభించడం దేశానికి గర్వకారణం అని అన్నారు.

మల్యాల: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు అత్యున్నత పురస్కా రం భారతరత్న ప్రకటించడం తెలుగుజాతికి గర్వకారణం అని మండలం బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఆర్థిక సంస్కరణల రూపకర్త అయిన పీవీతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అయిందని మండల శాఖ అధ్య క్షుడు నేరెళ్ల శ్రవన్ అన్నారు. కాగ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ లోక్ సభ నియోజకవర్గంలో నేడు ప్రారంభించే యాత్రలో భాగంగా శనివారం ఉదయం కొండగట్టు అంజన్నను దర్శించుకొని పూజలు నిర్వహిస్తారని తెలిపారు. పార్టీ శ్రేణులు తరలి రావాలని అన్నారు.

కథలాపూర్: దేశ మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావుకు దేశ అత్యు న్నత పురస్కారం భారతరత్న ప్రకటించడం హర్షణీయమని పీసీసీ కార్యవర్గ సభ్యుడు తొట్ల అంజయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం పేర్కొన్నారు. బహుభాషా కోవిదుడు, ఆర్థిక సంస్కరణల్లో ఆద్యుడిగా పేరుగాంచిన పీవీకి భారతరత్న అవార్డు ప్రకటిం చడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఎగ్యారపు శ్రీహరి, గోపిడి ధనుంజయ్‌రెడ్డి, అల్లకుంట లింగంగౌడ్, మార్గం శ్రీనివాస్, రేహాన్, జవ్వాజి చౌదరి, ఉరుమల్ల చారి ఉన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 9: విద్యార్థులు చిన్నవారికి, తోటివారికి ఆదర్శంగా నిలిచేలా వారి అలవాట్లు ఉండాలని విద్యుత్ అదనపు డివిజన్ అధికారి దురిశెట్టి మనోహరచారి, కళాశాల ప్రిన్సిపాల్ రావులపల్లి వెంకటేశ్వర రావు అన్నారు. శుక్రవారం మెట్‌పల్లి జూనియర్ కళాశాల వార్షికోత్సవం నిర్వహించారు.

విద్యార్థులు ఆటాపాటలతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భం గా వారు మాట్లాడుతూ గత సంవత్సరంలో పరీక్షలు రాసిన విద్యార్థులు మంచి ఫలితాలను సాధించి, జాతీయ, రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించారన్నారు. విద్యార్థులు వార్షిక పరీక్షల్లో శ్రద్ధగా రాసి మంచి ఫలితాలను సాధించి తల్లిదండ్రులకు, కళా శాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రస్తుతం విద్యార్థులు పేడ దారి పట్టి వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, అలాంటి వాటికి దూరంగా ఉండి మంచి భవిష్యత్తును ఏర్పాటు చేసుకోవాలని పలు సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.


రోడ్డు హద్దులను పరిశీలించిన ఆర్డీవో

న్యాయం చేయాలని భూ నిర్వాసితుల వినతి


భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో రాజేశ్వర్

కోరుట్ల ఫిబ్రవరి 9: పట్టణం శివారు బొమ్మెన రోడ్డులోని జాతీయ రహదారి కోసం ఏర్పాటు చేసిన హద్దులు శుక్రవారం కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి రాజేశ్వర్ పరిశీలించారు. మూడు రోజుల నుంచి నేష నల్ హైవే అధికారులు పట్టణ శివారు నుంచి జగదల్‌పూర్ - నిజామా బాద్ జాతీయ రహదారి నిర్మాణం కోసం హద్దులు ఏర్పాటు చేశారు. వాటికి బదులు రెండు రోజుల క్రితం మరోమారు అదే అధికారులు మరో ప్రాంతంలో హద్దులను ఏర్పాటు చేయడంతో ఆందోళన చెందిన సంబం ధిత భూయజమానులు కోరుట్ల ఆర్డీవోకు వినతిపత్రం అందించారు. రైతులు భూ యజమానుల కోరిక మేరకు ఆర్డీవో సంబంధిత భూము లను పరిశీలించారు. విషయం ఉన్నతాధికారులకు నివేదించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

ఉచిత దంత వైద్య శిబిరం



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

కోరుట్ల ఫిబ్రవరి 9 : పట్టణంలోని సరస్వతి శిశుమందిర్‌లో శుక్రవారం లయన్స్, కోటి నవదుర్గ మహిళ లయన్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణంలోని మున్సిపల్ కౌన్సిలర్, లయన్స్ క్లబ్ సభ్యులు అడెపు కమల-మధు పెళ్లి రోజు పురస్కరించుకుని సరస్వతి శిశు మందిర్‌లో విద్యార్థులకు వైద్యుడు అడెపు అనురాగ్ వైద్య పరీక్షలను నిర్వహించారు.

వైద్య పరీక్షలను నిర్వహించిన వైద్యుడు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అవసరం ఉన్న విద్యార్థులకు అడెపు కమల- మధు దంపతులు మందులను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశా ల కరస్పాడెంట్ నీలి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు గోపు వెంకటేష్, లయన్స్ క్లబ్ సభ్యులు వనపర్తి చంద్రమోహన్, కుందారపు మహేందర్, ఆడెపు ప్రవీణ్, గుంటుక సురేష్, డాక్టర్ దిలీప్‌రావుల పాల్గొన్నారు.

సమ్మక్క-సారలమ్మ జాతరకు

ముమ్మర ఏర్పాట్లు

ధర్మపురిలో ఫిబ్రవరి 20 నుంచి ఉత్సవాలు



సమ్మక్క-సారలమ్మ జాతర కోసం ఏర్పాట్లు చేసిన దృశ్యం

ధర్మపురి, ఫిబ్రవరి 9: ధర్మపురి పట్టణంలోని గోదావరి నదీ తీరాన గల మోరీల వాగు సమీపంలో ఈ నెల 20 నుంచి 23 వరకు జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాల కోసం వేగవంతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రెండేళ్లకు ఒక సారి సమ్మక్క-సారలమ్మ మైదానంలో జరిగే ఉత్సవాలను ఈ ఏడా ది అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవాల ప్రత్యేక అధికారి ద్యావళ్ల కిరణ్‌కుమార్, ఉత్సవ కమి టీ అధ్యక్షుడు ఒల్లెపు శంకర్‌రాజు పర్యవేక్షణలో వస తుల ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రస్తుతం శ్రీ సమ్మక్క- సారలమ్మ మైదానం చదు ను చేయించి గద్దెల చుట్టు మరమ్మత్తు పనులు చేసి, రంగులు వేసే పనులు ఆరంభించారు. గతంలో కన్న అధిక సంఖ్యలో భక్తులు హాజరవుతారని భావించి టెంట్లు ఏర్పాటు చేసి, మంచినీటి వసతుల ఏర్పాట్లలో లోపాలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రత్యేక దృష్టి సారించారు. ఉత్సవాల ప్రత్యేక అధికారి, ధర్మపురి ఆలయ సూపరింటెండెం ట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, పూజారి బైరబోయిన వెం కటయ్య, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఒల్లెపు శంకర్ రాజు వసతుల ఏర్పాట్లు, పనులు పర్యవేక్షిస్తున్నారు. అలాగే ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛ నీ య సంఘటనలు జరుగకుండా సీఐ రాంనర్సింహా రెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ దత్తాత్రి, భారీ సంఖ్యలో పో లీస్ బందోబస్తు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

ఫిబ్రవరి 12న బహిరంగ వేలం పాట

ధర్మపురి పట్టణంలోని శ్రీ సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాల సందర్భంగా కొబ్బెరికాయలు, బెల్లం విక్రయించే హక్కు కోసం ఈ నెల 12న సోమ వారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఉత్సవాల ప్రత్యేక అధికారి ద్యావళ్ల కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల ఆవరణలో నిర్వహించే ఈ వేలం పాటలో పాల్గొనే వ్యక్తులు రూ 2000 డిపాజిట్ చెల్లించాలని కోరారు. వేలం పాట ద్వారా హక్కు పొందిన వ్యక్తికి ఈ నెల 20 నుంచి 23 వర కు మాత్రమే కొబ్బెరికాయలు, బెల్లం విక్రయించే హక్కు ఉంటుందన్నారు. ఆసక్తి కలిగి ఉన్న వ్యక్తు లు వేలం పాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహించాలి

జడ్పీ సీఈవో రఘువరన్


పెగడపల్లిలో ఇంటింటా సర్వేను పరిశీలించిన జడ్పీ సీఈవో రఘువరన్

పెగడపల్లి, ఫిబ్రవరి 9 : గ్రామాల్లో పారిశుధ్య పనులు పకడ్బందీగా నిర్వహిం చాలని జిల్లా పరిషత్ సీఈవో రఘువరన్ పేర్కొన్నారు. పెగడపల్లి మండల కేం ద్రంలోని గ్రామపంచాయతీ పరిదిలో ప్రత్యేక పారిశుధ్య పనులను జడ్పీ సీఈవో రఘువరన్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరు గ్యారంటీల అములలో బాగంగా గ్యాస్ కార్డు నమోదు తదితర వివరాల న మోదును పరిశీలించి, వివరాల నమోదులో అవకతవకల కు ఆస్కారం లేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎం పీడీవో జె.పుల్లయ్య, ఏపీఎం సమత, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, పీటీసీ స్వామి ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

మెట్‌పల్లి రూరల్ : గ్రామాల్లోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని మెట్‌పల్లి ఎంపీడీవో భీమేష్‌రెడ్డి అన్నారు. గ్రా మాల స్వచ్ఛతకు ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య కార్యక్ర మంలో భాగంగా శుక్రవారం మండలంలోని ఆత్మనగర్ గ్రామాల్లో ర్యాలీలు తీసి ప్రజలకు అవగాహ న కల్పించారు. ఆయన మాట్లాడుతూ మురుగు కాలువలు, వీధులు శుభ్రంగా ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లోని ప్రజలు ఇంట్లోని చె త్తను మురికి కాలువలుల్లో, రోడ్లపై వేయకుండా పంచాయతీ సిబ్బందికి అందజే యాలని, ప్రజలు ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప లు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు జ రుపుల శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ చిలివేరి విజయ్, కార్యదర్శి నిజామొద్దిన్, పంచాయతీ సిబ్బం ది, ఏఎన్ఎమ్ వసంత, ఆశా వర్కర్ హేమ, అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామ స్థులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు జలాభిషేకం


గంగాజలాన్ని ఊరేగింపుగా తీసుకొస్తున్న గ్రామస్థులు

మల్లాపూర్, ఫిబ్రవరి, 9 : మండలంలోని పునరావస గ్రామమైన కుస్తాపూర్ గ్రామంలోని రైతులు శుక్రవారం గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. మాఘమాసం అమావా స్యను పురస్కరించుకొని గ్రామంలోని రైతులు మండ లం లోని మొగిలిపేట గోదావరి నది నుంచి గంగా జలంను ఊ రేగింపుగా డప్పు చప్పుల మధ్య కాలినడకతో తీసుకొచ్చారు. గ్రామంలోని పాడి పంటాలు సమృద్ధిగా పండాలని, గ్రామ స్థులు ఆరోగ్యంగా ఉండాలని గ్రామ దేవతలకు జలాభిషే కాలు చేశారు. అనంతరం గ్రామ దేవతనలు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతి నిధులు, నాయకులు, గ్రామస్థులు, పాల్గొన్నారు.

వేంకటేశ్వస్వామి ఆలయంలో పూజలు

కొడిమ్యాల, ఫిబ్రవరి 9 : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ నక్షత్రం సందర్భం గా శనివారం ఆలయ కమిటీ వారు భక్తులకు అన్నదానం నిర్వహించారు. అంతక ముందు స్వామి వారికి పంచామృ త అభిషేకం, స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఉద యం నుంచి స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ పూ జారి నాగరాజు రమేష్, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

సామాజిక సేవకుడికి డాక్టరేట్

రాయికల్, ఫిబ్రవరి 9: రాయికల్ పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు మహమ్మద్ ముస్తాక్ అహ్మద్ సా మాజిక సేవలో పొందిన గుర్తింపుకుగాను ఫ్రెండ్‌షిప్ మిని స్ట్రీస్ ఆధ్వర్యంలో ఆయనకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చే యనున్నారు. ఆలూరు కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్, తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో ముస్తాక్ అహ్మద్ డాక్టరేట్ అందుకోనున్నాడు. ముస్తాక్ అహ్మద్‌ను పలువురు అభినందించారు.

బాధిత కుటుంబానికి చేయూత

కోనరావుపేట, ఫిబ్రవరి 9: కోనరావుపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన కాసర్ల శ్రీనివాస్ మృతి చెందగా పేదరికంలో ఉన్న ఆ కుటుంబానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాల మేరకు మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో తక్షణ సహాయం కింద 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. కాంగ్రెస్ నాయకులు సత్యం వెం కటేశం, నరేష్, మహేష్, తిరుపతి, ప్రశాంత్, బాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

కూతురు పెళ్లికి సీఎంను ఆహ్వానించిన 'జువ్వాడి'


సీఎంకు పెళ్లి పత్రిక అందిస్తున్న జువ్వాడి కుటుంబ సభ్యులు

కోరుట్ల ఫిబ్రవరి 9 : తన కూతురు పెళ్లికి హాజరు కావాలని కోరుతూ శుక్రవా రం కోరుట్ల కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చా ర్జి జువ్వాడి నర్సింగరావు కటుంబ సభ్యు లు సీఎం రేవంత్ రెడ్డిని కలిసి పెళ్లి పత్రి కను అందించారు. ఈ నెల 14వ తేదీ గో వా కేంద్రంలోని ఓ కల్యాణ భవనంలో జ రిగే పెళ్లి వేడుకలతో పాటు 26న జరిగే రిసెప్షన్‌కు రావాలని పెళ్లి కూతురు డా క్టర్ రితిమతో నర్సింగరావు-రజనీ దంపతు లు రేవంత్ రెడ్డికి పెళ్లి పత్రికను అందించి ఆ హ్వానించారు.

ఈ సందర్భంగా నర్సింగరావు స్థానిక పా త్రికేయులతో ఫోన్ ద్వార మాట్లాడారు. పెళ్లికి రేవంత్ రెడ్డితో పాటు అతడి భార్య, రాష్ట్ర మం త్రులు హాజరు కానున్నట్లు తెలి పారు.

దోమల నివారణకు పకడ్బందీ చర్యలు-కలెక్టర్

కొడిమ్యాల, ఫిబ్రవరి 9 : దోమల నివారణ కు పకడ్బంది చర్యలు చేపట్టాలను కలెక్టర్ యాస్మిన్‌బాషా అన్నారు. శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా మండలం లోని పూడూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశా లలో నిర్వహించిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దో మలతో ప్రజలు మలేరియా, ఫైలేరియా, డెం గ్యూ వంటి వ్యాధుల బారిన పడే అవకాశం ఉందన్నారు. ప్రతి ఇంటికి పారిశుధ్యంపై, క్లో రినేషన్‌పై అవగాహన కలిపించాలన్నారు. గ్రా మ పంచాయతీ అధికారులు కార్యదర్శుల, సి బ్బంది సహకారంతో పారిశుధ్య కార్యక్ర మా లను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీపీవో దేవరాజ్, ఎంపీడీవో పద్మజరాణి, మెడికల్ ఆఫీసర్ పరమేశ్వరీ, ఏఈ మణిదీప్, ఎంపీవో ప్రవీణ్, సీహె చ్‌వో రాజశేఖర్, పాఠశాల ఉపాధ్యాయులు, అంగన్ వాడీ టీచ్చు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 9: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకుడికి యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందజేశారు. వేములవాడ మండలం చింతలఠాణా గ్రామానికి చెందిన యువకుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన ప్రసాద్‌కు వైద్య ఖర్చులు నిమిత్తం యువ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గుడిసెల రాజశేఖర్ టీం సభ్యులతో కలిసి అందజేశారు. యువ ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ ప్రశాంత్ ఉన్నారు..

కట్కాపూర్ పల్లె దవాఖానాకు జాతీయ స్థాయి గుర్తింపు


పల్లె దవాఖానాను సందర్శించిన జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం(ఫైల్)

రాయికల్, ఫిబ్రవరి 9: రాయికల్ మండలంలోని కట్కాపూర్ గ్రామంలోని పల్లె దవాఖానకు జాతీయ నాణ్యత ప్ర మాణాలకు గుర్తింపు లభించినట్లు జి ల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ తెలి పారు. జనవరిలో పల్లె దవాఖా నాలో అందుతున్న ఐదు విభాగాల సేవలను జాతీయ నాణ్యత ప్రమాణాల బృందం పరిశీ లించి, రికార్డులు తనిఖీ చేసింది. పలు విభాగాల్లో మార్కులు కేటాయించి జాతీయ నాణ్య త ప్రమాణాల గుర్తింపు ధృవీకరణ పత్రం అందజేసింది. యేటా మూడే ళ్ల పాటు దవాఖా నాకు రూ.1.50 లక్షల ప్రో త్సాహక నిధులు అందజేయనున్నట్లు తెలిపా రు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందిని, జిల్లా వై ద్యాధికారులను గ్రామ నాయకులు, ప్రజాప్ర తినిధులు అభినం దించారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోండి

మున్సిపల్ కమిషనర్‌కు బీజేవైఎం వినతి


కమిషనర్ రమేష్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న భాస్కర్

ధర్మపురి, ఫిబ్రవరి 9: ధర్మపురి పట్టణంలో దోమల నివారణ కోసం చర్యలు తీ సుకోవాలని, కుక్కల బెడదను అరికట్టాలని కోరుతూ బీజేవైఎం ఆధ్వర్యంలో ము న్సిపల్ కమిషనర్ సీహెచ్ రమేష్‌కు శుక్రవారం వినతి పత్రాన్ని సమర్పించారు. బీజేవైఎం పట్టణ శాఖ అధ్యక్షులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో పలువురు కార్యకర్త లు మున్సిపల్ కార్యాలయానికి బయలుదేరి వెళ్లారు. అనంతరం పలు సమస్య లతో కూడిన వినతి పత్రాన్ని ఆయనకు అందించారు. ఈ సందర్భంగా గాజు భా స్కర్ మాట్లాడుతూ పట్టణంలో దోమల బెడద వల్ల ప్రజలు అనారోగ్యానికి గుర వుతున్నారని అన్నారు. వెంటనే ప్రతి వాడలో దోమల నివారణ కోసం ఫాగింగ్ మిషన్ ద్వారా పొగ స్ప్రే చేయించాలని పేర్కొన్నారు. అలాగే ఇటీవల కాలంలో కు క్కల బెడద అధికమయ్యిందని, కూరగాయల మార్కెట్, బస్‌స్టేషన్, పాఠశాలల కు వెళ్లేందుకు వినియోగదారులు, ప్రయాణికులు, విద్యార్థులు తీవ్ర భయాందోళ నకు గురవుతున్నారని ఆయన తెలిపారు. కొన్ని సందర్భాల్లో కుక్కలు దాడి చేసి అనేక మందిని గాయపరిచాయన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చే శారు. వినతి పత్రాన్ని సమర్పించిన వారిలో బీజేవైఎం పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, బీజేపీ పట్టణ అధ్యక్షులు బెజ్జారపు లవణ్, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివా స్, అసెంబ్లీ కో కన్వీనర్ బండారి లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లెర్ల సురేం దర్, ఓబీసీ జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ పట్టణ ప్రధాన కార్యదర్శి తిరు మ న్దాసు సత్యనారాయణ, నారవేణి మూర్తి, మండలోజు సూరజ్, జిల్లా సోషల్ మీడియా కో-కన్వీనర్ దివిటి శ్రీదర్, ఆనందాసు నవీన్, బండారి గణేష్ పాల్గొన్నారు.

నేడు కథలాపూర్ మండలంలో ప్రజాహిత యాత్ర

కథలాపూర్, ఫిబ్రవరి 9: మండలంలోని తక్కళ్లపల్లి, బొమ్మెన, సిరికొండ గ్రామాల్లో ఎంపీ, బీజేపీ జాతీయ ప్ర ధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ శనివారం ప్రజా హిత యాత్రలో పాల్గొంటారని కిసాన్ మోర్చా జిల్లా అ ధ్యక్షుడు కొడిపల్లి గోపాల్‌రెడ్డి తెలిపారు. భారతదేశంలో నరేంద్రమోదీ చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాల ను ప్రజలకు ఈ ప్రజాహిత యాత్రలో వివరించనున్నా రని చెప్పారు. కార్యకర్తలు అధిక సంఖ్యలో కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

బీఆర్ఎస్‌కు మండల అధ్యక్షుడి రాజీనామా

కథలాపూర్, ఫిబ్రవరి 9 : మండల బీఆర్ఎస్ అధ్యక్షు డు గడీల గంగప్రసాద్ తన పదవికి శుక్రవారం రాజీనా మా చేశారు. పార్టీ అధ్యక్ష పదవిలో కొనసాగిన సమయం లో ఎన్నో ఒత్తిళ్లకు గురైనట్లు చెప్పారు. ప్రస్తుతం పార్టీలో జరుగుతున్న పరిణామాల దృష్ట్యా, తన వ్యక్తిగత కారణా లతో పార్టీని వీడుతున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా తక్కళ్లపల్లి మాజీ సర్పంచ్ మొలిగె శ్రీనివాస్ బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా వీరు కాంగ్రె స్ పార్టీలో చేరడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

గ్యాస్ సిలిండర్ దరఖాస్తుల పరిశీలన

రాయికల్, ఫిబ్రవరి 9: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో వచ్చిన గ్యాస్ కనెక్షన్ కోసం వచ్చిన దరఖాస్తులను ఎంపీడీవో గంగుల సంతోష్ కు మార్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మం డలంలోని ఇటిక్యాల, రామాజీపేట గ్రామాల్లో ప్రజలు ద రఖాస్తు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించారు.

రేపు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

వేములవాడ, ఫిబ్రవరి 9: వేములవాడ పట్టణంలోని బో యినిపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 5వ తర గతిలో ప్రవేశం కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిం చనున్నట్లు గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ సూర్య ప్రకాశ్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగనున్న ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు హాల్ టికెట్‌తోపాటు ఏదేని గుర్తింపుకార్డును వెంట తెచ్చుకోవాలని పేర్కొన్నారు. కనీసం గంట ముందుగా పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. మెరిట్ ఆధారంగా టీఆర్ఈఐఎస్, టీఎస్‌డ బ్ల్యూఆర్ఎస్ టీటీడబ్ల్యూఆర్ఎస్, ఎంజేబీటీసీడబ్ల్యూఆర్ఎస్ పాఠశాలల్లో ప్రవేశం లభిస్తుందని వివరించారు.

విద్యార్థులకు ఉచిత రక్త పరీక్షలు

మెట్‌పల్లి, ఫిబ్రవరి, 9 : పట్టణంలోని నూతన జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు ఉచితంగా రక్త నిర్ధారణ పరీక్షలను ల్యాబ్ టెక్నిషయన్‌తో ఉపాధ్యా యులు చే యించారు. శుక్రవారం పట్టణంలోని ల్యాబ్ టెక్నిషయన్ బాలకృష్ణ, రాంపెల్లి బాలరాజుల సేవ భావంతో ఉచితం గా 100మంది విద్యార్థులకు రక్తల పరీక్షలు చేశారు. ఉ చిత రక్త పరీక్షలు చేసిన ల్యాబ్ టెక్నిషయన్‌లను ఉపా ధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపా ధ్యాయ బృందం, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

ఎండపల్లి, ఫిబ్రవరి 9 : మహిళలు అన్ని రంగాల్లో రా ణించాలని, వారిలో ఉన్న తెలివి తేటలను బయటకు తీ సి వారి ఎదుగుదల కోసం తోడ్పాటు అందించడమే ఈ కార్యక్రమ ఉద్దేశ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సతీమణి అడ్లూరి కాంతా కుమారి అన్నారు. శుక్రవారం మండలం లోని ఎస్ఆర్ గార్డెన్‌లో సక్సెస్ ఇని స్టూట్ ఆఫ్ బ్యూటీ సొల్యూషన్ వారి ఆధ్వర్యంలో కొలుముల దామోదర్ యాదవ్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా అకాడ మీ ఫౌండర్ స్వప్నారావు, కాంతా కుమారి జ్యో తి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్త్రీల అభ్యున్నతే ఫౌండేషన్ లక్ష్యమని, స్త్రీలు ఎవరి కాళ్ల మీద వారు ని లబడే విధంగా వారికి తోడ్పాటు అందిస్తామన్నారు. అ నంతరం ధర్మారం ఎస్ఐ కార్యక్రమానికి రాగా ఆమె మ హిళ ఎస్ఐ కావడంతో ఈమెను స్ఫూ ర్తిగా తీసుకోవా లన్నారు. ఆమెకు శాలువాతో సన్మానం చేశారు. విద్యార్థు లకు ట్రైనర్‌ల ద్వారా జీవిత లక్ష్యాలను ఎలా చేదించాలో, సమయం ఎంత విలువైందో వివరించారు. జంగిళి మ హేందర్, మాజీ సర్పంచ్ గెల్లు చంద్రశేఖర్, ఫౌండర్ స భ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల సర్వే

భీమారం, ఫిబ్రవరి 9: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మ కంగా చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చిన దర ఖాస్తులను శుక్రవారం భీమారం మండల కేంద్రంలో అంగన్‌వాడీ, విద్యుత్ సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ దరఖాస్తుదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పల్లవి, శ్యామల, స్వరూప, లావణ్య, అశోక్, కరుణాకర్, వనిత, సంఘవి పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ

రాయికల్, ఫిబ్రవరి 9: మండలంలోని ఆలూరు పాఠ శాలలో గురుకుల ప్రవేశ పరీక్షకు హాజరయ్యే 25 మంది విద్యార్థులకు ఎలిపెద్ది మల్లారెడ్డి-సునీతలు శుక్రవారం ప రీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. వీరిని ప లువురు నాయకులు, అధికారులు, పాఠశాల ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్య క్రమంలో మాజీ సర్పంచ్ మెక్కొండ రాంరెడ్డి, ఉపా ధ్యా యులు సాయికృష్ణ, కిషోర్, నాగరాజు, శృతి, కవిత, గోదావరి, సుజాత, పంచాయతీ కార్యదర్శి రాజశ్రీ, ఎఫ్ఏ నర్సయ్య పాల్గొన్నారు.